# దారిలో దొరికిన ప్రేమలేఖలు



– ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## – 12 –

**మళ్ళీ నిన్ను** చూశాను. నీ దారిన నువ్వు నడుచుకుంటూ పోతున్నావు. నీ పెదాలపై చిరునవ్వు.. ఎందుకో నాకేం తెలుసూ? అడగాలనే ఉత్సాహాన్ని అణుచుకున్నాను. పోనీ అడిగాననుకో, నువ్వేమంటావూ? "ఎవరునువ్వు" అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తావు. అంతేగా మరీ! నీ దృష్టిలో నేను నీకు అపరిచితుడ్ని. కానీ మరి నాకు? నా ఊహల్లో, ఆలోచనల్లో ఉన్నది కేవలం నువ్వే.



"అసలు ఒక్కమాటైనా మాట్లాడకుండా, పరిచయమైనా లేకుండా ప్రేమ అనేది పుడుతుందా?" అని నా మనసు ఎన్నిసార్లు నన్ను ప్రశ్నించిందో నీకు తెలిసే తెలీదు కదూ! ప్రేమించింది ఆ మనసే.. మళ్ళీ ప్రశ్నించేదీ ఆ మనసే. ఇంకో విచిత్రం తెలుసా 'నీది' అనే ప్రతీదాన్నీ నేను ప్రేమించాను. ఎన్ని లక్షలసార్లు నీ మొహాన్నీ, కళ్ళనీ, నడకనీ, నువ్వు నీ సున్నితమైన నీ కదలికల్నీ నా మనసులో మళ్ళీ మళ్ళీ 'రీవైండ్' చేసుకు చూశానో నీకెలా తెలుస్తుంది? చాలాసార్లు అనిపించేది ప్రేమశరీరానికి అతీతమైనదని. అవును., అది నిజం కూడా! కానీ, తొలిసారి ప్రేమ అనేది పుట్టేది శరీరాన్ని చూసిన తరవాతేగా! ఈ శరీరం అనేది లేకపోతే ప్రేమని ఎలా గుర్తించడం? శరీరం ఉంది.. శరీరం లోపలో అణువణువునో మనస్సూ ఉంది. ఆ మనసులో అనేకానేక భావాలున్నాయి. అందులోనే సుఖమూ, దుఃఖమూ, భయమూ, భ్రాంతి, సుఖమూ, సహనము, శాంతీ, అశాంతి, ప్రేమా, ద్వేషమూ స్వార్థమూ, త్యాగమూ అన్నీ ఉన్నాయి. నిన్ను తొలిసారి చూసిన మరుక్షణమే ఆ మనసులోంచి పాతాళగంగలా పైకొచ్చింది ప్రేమమాత్రమే. ఒక్క ప్రేమ మాత్రమే.

ఆ పొంగుకొచ్చిన ప్రేమ అక్కడితో ఆగలేదు ప్రాణమా. మిగతావాటినన్నింటినీ పక్కకి నెట్టేసి, ఆఖరికి నా ఉనికిని కూడా పక్కకి నెట్టేసి, నిన్ను మాత్రమే మనసులో ప్రతిష్ఠించుకుంది. నిరంతరం ఒకటే ఆశ.. ఒకటే ధ్యాస. సంవత్సరం కాబోతోంది నేస్తమా. ఎన్నివేల ఉత్తరాలు రాసి నీకు పంపకుండా చింపేశానో. కానీ, నా ప్రేమని నీకు తెలపకపోతే ఎలా? నువ్వు కాదంటావేమోననే భయంతోనూ సంకోచంతోనూ ఇలా ఎన్ని రాత్రుల భారాన్ని నా కనుపాపల చేత మోయించనూ? గుండె గడియారాన్ని ఆడించడం ఎంత దుర్భరంగా వుందో నీకు తెలుస్తోందా జీవమా!

జీవితమనే వృక్షం, క్షణాలనే ఆకుల్ని రాల్చేస్తోంది. వృక్షానికి అయితే మళ్ళీ చివురుటాకులు పుడతాయి. కాలం వసంతమై దాన్ని కనికరిస్తుంది. కాలమే మేఘమై దాని దాహాన్ని తీరుస్తుంది. మరి నాదాహాన్ని తీర్చేదెవరూ? రాలిపోయే నా ఆశల పత్రాల స్థానంలో చివుళ్ళు తొడిగించేది ఎవరూ? కేవలం నువ్వు మాత్రమే తీర్చగలవు. నువ్వు మాత్రమే ప్రాణం పొయ్యగలవు.

ఊహ వేరు.. నిజం వేరు. ఈ రెండూ నాకు తెలిసినవే నా ఊహల్లో సర్వానివీ నువ్వే. కానీ, నిజంలో మాత్రం నేనెవరోకూడా తెలీదు నీకు. ఊహలో ఊహకి కూడా రాని అడ్డుగోడలు 'నిజం'లో నిజంగా ఉన్నాయి. అంతస్థుల అడ్డుగోడలు 'నిజం'లో నిజంగా ఉన్నాయి అంతస్థుల అడ్డుగోడలున్నాయి. ఆస్తుల అడ్డుగోడలున్నాయి. అవన్నీ అధిగమించడం సాధ్యంకాదని నాకు తెలుసు.

కానీ ఒక్క నిజం మాత్రం చెప్పక తప్పదు. 'పిరికివాడికి ప్రేమించే అర్హత' లేదనేదే ఆ ఒక్క నిజమూ. ఎందుకంటే, ఆ ప్రేమించడం అనేది నీరు లేని మబ్బులాంటిది. కనీసం ఆ నీరులేని మబ్బు అయినా నీడనిస్తుంది. కానీ పిరికివాడి ప్రేమమాత్రం ఆ పిరికివాడికి దుఃఖాన్ని తప్ప మరేదీ ఇవ్వలేదు. నాలోని పిరికిదనమే నన్నింతకాలం మూర్ఖుడ్ని చేసిందని ఇదిగో, ఇప్పుడే, యీ ఉత్తరం వ్రాస్తున్నప్పుడే నాకూ తెలుస్తోంది. ఈ వన్‌సైడ్ ప్రేమవల్ల నేను నీకు ఏ విధంగా ఉపయోగపడగలిగానూ? లక్షకోట్ల నిట్టూర్పులూ నిరాశలూ ఒక్క 'ఆశ'కి సరితూగగలవా? పదివేలకోట్ల ఊహలు ఒక్క 'నిజాని'కి సరిసాటి రాగలవా? లేదు నేస్తం లేదు. జీవితాన్ని భ్రమల్లోనూ ఊహల్లోనూ గడిపేవాడు ఏనాడూ గమ్యాన్ని చేరలేడు. మానవుడి గమ్యం, అది సామాన్యుడిదైనా అసామాన్యుడైనా ఒక్కటే. అదే మృత్యువు. జీవితాన్ని ప్రేమించేవాడు ఆ గమ్యాన్ని గురించి అస్సలు ఆలోచించడు. ఆ గమ్యం చేరడానికి ఫలు మానవప్రయత్నమే అక్కరలేదు. మృత్యువు తనంత తానుగా వచ్చేది. కానీ ప్రేమ?

నీ అంతట నువ్వు సాధించుకోవాల్సింది. సాధనలోనే ఒక్కసారి 'ఓటమి' చవిచూడాల్సి రావొచ్చు. కానీ, అసలేమీ ప్రయత్నించకుండా నిర్వికారంగా కూర్చోవడం కంటే, ప్రయత్నించి ఓడిపోవడం కూడా గొప్పదేకదూ.

ఇదిగో.. నా 'నిస్పృహాయత' అనే గూడుని నేనే ముక్కలు చేసేస్తున్నా! నా నిరాశ అనే చీకటినీ నేనే నరికేస్తున్నా. ఒక్క గెలుపుకోసం లక్ష ఓటములకి నన్ను నేనే యీ క్షణం నించీ సిద్ధం చేసుకుంటున్నా. ప్రాణమా.. ఇదిగో యీ ఉత్తరం నీకు రేపటికి అందుతుంది. "ఎవడీ పిచ్చి ప్రేమికుడు" అని నువ్వు నొసలు విరిచేలోగా, అదిగో పల్లవిస్తున్న ఆ ప్రకృతి సాక్షిగా నేను నీ ముందు నిలుచుంటాను. ఆ తరవాతంటావా..,

నువ్వు కరుణిస్తే నేను 'భోగి'ని

నిరాకరిస్తే నేను 'యోగి'ని

అలా ఎందుకంటావా?

నువ్వు అంగీకరిస్తే, ఈ సమస్త ప్రకృతిలోనూ నిన్నే నిన్నే నిన్నే చూసుకుంటూ ప్రకృతిలో ప్రకృతిగా ఐక్యమైపోతా..

ప్రియతమా...

ఇప్పటివరకు ఏ ఉత్తరమూ నీకు నేను చేరనివ్వలేదు. ఇది మాత్రం నీకు చేరాలనే రాస్తున్నాను. చేరుతుంది.. చేరి తీరుతుంది ప్రాణమా...

ఊహలకి శలవిస్తూ

సత్యాన్ని స్వాగతిస్తూ

ఇట్లు

నీ

-X-



***ఒక్క క్షణం***

ఇది పన్నెండవ ఉత్తరం... మిగతావన్నీ చేరవలసినవారికి చేరినా చేరకపోయినా, యీ ఉత్తరం మాత్రం చేరుతుందని ఘంటాపథంగా తెలుసు.

ప్రేమకి ఎన్నో పార్శ్వాలుంటాయంటారు. అవన్నీ నాకు తెలీదు. నాకు తెలిసింది ఒకటే 'ప్రేమ' అంటే 'సత్యం'.

ప్రేమే సత్యం.. ప్రేమే శివం.. ప్రేమే సుందరీ.

ఆ ప్రేమ హృదయంలో ఉన్నంతకాలం మనిషే 'శివం'

లేనినాడు కేవలం 'శవం'

ప్రేమంటే స్వార్థంకాదు.. ప్రతీకారం కాదు..

ప్రేమంటే కరుణించే దైవమూ కాదు, కబళించే దెయ్యమూ కాదు.

మనిషి నిలవడానికి ఆధారం ప్రేమ

మనసు బ్రతకడానికాధారం ప్రేమ.

అది నిర్వచనాలకి లొంగదు.. నియంతృత్వానికి వొంగదు.

ఏదిలేక యీ సృష్టి నిస్తేజామౌతుందో

ఆ తేజమే ప్రేమ.

ఏదిలేక యీ విశ్వమే శూన్యమౌతుందో

ఆ ప్రాణమే ప్రేమ.

అది విజ్ఞానానికి అందదు.

ఏ వికారాన్నీ పొందదు.

అది 'అదే'

అందుకే...!

**ఓ ప్రేమికుడు**

*(సమాప్తం)*

Post your comments